తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సోమవారం 17 - 08 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 3

## సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం

# సీపీఎం పాదయాత్ర

### సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరాజు

### ఈనెల 31న ఇందిరాపార్కులో రైతులతో మహాధర్నా




ప్రజావారధి/మోత్కూరు

యాదాద్రి జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి 31 వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు తెలిపారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఆదివారం సీపీఎం మండల కమిటీ సమావేశం దడిపెల్లి ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం) ప్రాంతాలకు సాగునీరు అందించే బునాదిగాని కాల్వను 18 ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడం లేదని, కాల్వను వెడల్పు చేసి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కాల్వ పూర్తి కోసం నిధులు విడుదల చేస్తున్నట్టు ప్రకటనలే తప్ప నిధులు మాత్రం విడుదల చేయడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.420 కోట్లను సత్వరమే విడుదల చేసి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నవాబుపేట రిజర్వాయర్ ద్వారా గుండాల ప్రాంతానికి సాగునీరు అందించే పథకాన్ని కాలువలు తవ్వి వదిలేసారని, నీటి విడుదలకు నోచుకోక రైతాంగం వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసిఫ్ నగర్, ధర్మారెడ్డి పల్లి, పిల్లాయిపల్లికాల్వ పనులు నిధుల లేమితో నత్తనడక నడుస్తున్నాయని, నారాయణపురం, చౌటుప్పల్ ప్రాంతానికి సాగునీరు అందించే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా శివన్నగూడెం నుంచి రాచకొండ వరకు గ్రావిటీ ద్వారా నీరందించే రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని డిపిఆర్ ప్రకటించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులతో పాటు బునాది గాని కాల్వ నిధుల విడుదలపై ఈనెల 29న భువనగిరి నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్నామని, 31న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్దకు చేరుకుని రైతులతో కలిసి మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. రైతులు, ప్రజలు పాదయాత్రలో, మహాధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, ముత్తమ్మ, పామనగుల్ల రమేష్, మామిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
సోమవారం
జనరల్ న్యూస్
17 - 08 - 2026


## వినియోగదారుల సంక్షేమ సంఘం

# మోత్కూరు మండల నూతన కమిటీ




ప్రజావారధి/మోత్కూరు
మోత్కూర్ వినియోగదారుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మోత్కూరులో జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మోత్కూరు మండల అధ్యక్షునిగా మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షునిగా పసల ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా నిలిగొండ సైదులు, కార్యదర్శులుగా పసునూరి సురేష్, జంగ నాగయ్య, కోశాధికారిగా పెండెం నరహరి, కార్యవర్గ సభ్యులుగా కురుమేటి యాదయ్య, బిరుదు శ్రీను. జి.మురళిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మహ్మద్ రఫీ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కారాన్ని కోసం కృషి చేస్తానన్నారు. వినియోగదారులకు సంబంధించిన ఏ సమస్యలు ఉన్నా సంఘం దృష్టికి తీసుకవస్తే తగిన పరిష్కారం చూపుతామన్నారు.

## సేవా పథకం అందుకున్న కానిస్టేబుల్‌కు ఘన సన్మానం



ప్రజావారధి/మోత్కూరు
పోలీస్‌శాఖలో సేవలందించినందుకు గాను సేవా పతకం అందుకున్న కానిస్టేబుల్ కేమిడి రమేష్‌ను యువకులు ఘనంగా సన్మానించారు. కానిస్టేబుల్ రమేష్ ఆదివారం స్వగ్రామం మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామం వచ్చిన సందర్భంగా గ్రామ యువకులు ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. భువనగిరిలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రమేష్ సేవలకు గాను స్వాతంత్ర దినోత్సవం రోజున జిల్లా ఎస్పీ చేతుల మీదుగా సేవా పతకం అందుకోవడం గర్వకారణమని కొనియాడారు. ప్రజలకు మరింతగా సేవలందించడంతో పాటు ఉద్యోగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.







# గ్రామ దేవతలకు బోనాలు

మోత్కూరు మండలంలో ఆదివారం ప్రజలు బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పనకబండ, ముశిపట్ల, దత్తప్పగూడెం, పాలడుగు తదితర గ్రామాల్లో శ్రావణమాసం సందర్భంగా గ్రామ దేవతలకు మహిళలు భక్తిశ్రద్దలతో బోనాలు చేసి డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో బోనాల పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. ప్రజలు కానుకలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. -ప్రజావారధి/మోత్కూరు

